# ఒక హీలింగ్ టచ్
# హీల్ ప్యారడైజ్

**ఇది కల్లోల ప్రపంచం. అధికార రోగపూరిత బధిరాంధులు – అహంకారపూర మదోన్మత్తులు – యుద్ధోన్మాద పరిపాలకులు – ప్రాణాలకు విలువేలేని సామాన్యులు – ఇది కల్లోల ప్రపంచం మాత్రమే. భయపడకు మిత్రమా! భూమి పొరల్లో – కాలం తెరల్లో కలిసిపోతారు – భయపడకు మిత్రమా! ఇది మానవ జాతి చరిత్ర – ఎన్ని వేల సంవత్సరాలయినా ఇదే చరిత్ర – పంచభూతాల సాక్షిగా, మనిషి అజ్ఞానం – స్వార్థం – తన నీడను చూసి తనకే భయం! తనెవరో తెలియని అవిద్య – తనకు తానే కనపడని తమస్సు!!**


**ఇంతటి కల్లోల ప్రపంచంలో కొన్ని పవిత్రమైన ప్రదేశాలు వుంటాయి. అక్కడ సాధుసేవా పరాయణులుంటారు. అనాథలకు – దిక్కులేని పసివాళ్లకు తామే దిక్కయి అక్కున చేర్చుకుంటారు. దయ-ప్రేమ మహా సముద్రాల్లాంటివి. ఎంత తోడినా వట్టి పోనివి. అలాంటి కారణజన్ములుంటారు. తమని తాము మానవసేవ కోసం సమర్పించుకుంటారు. వారే మాధవులవుతారు. అలాంటి మాధవుణ్ణి పరిచయం చేస్తాం రండి!...**

**– ఎ.కె.**

నెలరోజుల క్రితం నుంచి అశ్వినికుమార్ గారు గన్నవరం సమీపంలోని తోటపల్లిలో ఉన్నటువంటి హీల్ ప్యారడైజ్ స్కూల్ చూసి, ఆ స్కూల్ ఫౌండర్ డా.కోనేరు సత్యప్రసాద్ గారిని కలవాలని అంటుంటే నా మట్టిబుర్రకు అర్థమై అలాగే సర్ అనటానికి ఇంత సమయం పట్టింది. నిజానికి వెళ్ళొచ్చిన తర్వాత బుర్రలోని మట్టి కొంతయినా ఒండ్రుమట్టిగా మారిందని చెప్పుకోవటానికి సంతోషంగా ఉంది..

ఈ ప్రయాణంలో అశ్విని గారి డాల్, కత్తులుగా నేను, ప్రొ.పార్థసారధిగారు అవతరించాం. క్రమశిక్షణకు మారుపేరయిన అశ్విని గారు ఆ స్కూల్ వివరాలున్న వెబ్ సైట్ మాకు ఫార్వర్డ్ చేశారు. ఎలాగో వెళ్తున్నాం అక్కడ చూసినప్పుడు అన్నీ తెలుస్తాయి కదా అని చేరుకున్నాం మేం..

**ఫిబ్రవరి ఒకటి ఆదివారం** : ఉదయం ఆరు గంటలు అవుతోంది.. ఆదివారం ఆనందహేలలో మునిగి ఉన్న భాగ్యనగరం ఇంకా మేలుకోలేదు. చుట్టూ మంచుతెరలు కట్టుకుని నిదరోతున్నవేళ కొండాపూర్ లోని సి.ఆర్.ఫౌండేషన్ చేరుకున్నాం.. వైట్ డిజైర్ కార్ మాకోసం ఎదురు చూపుల్లో ఉంది. డిజైర్ డ్రైవర్ పరమేశ్ అక్కడికి రాత్రికే చేరుకున్నాడు. ఫౌండేషన్లో ఒకటీ అరా వ్యక్తులు మార్నింగ్ వాక్కు నడుం బిగించారు. మా ప్రయాణం కోసం తెచ్చుకున్న సంచుల్ని వెనక బూట్‌లో సర్దేశాక ఆరుగంటల నలభై ఐదు నిముషాలకు మా కారు పూలతేరులా బయల్దేరింది.. ప్రతి ప్రయాణంలో అశ్వినిగారు రాజ్యాంగం రాసిస్తారు. ముఖ్యంగా డ్రైవర్ ఫోన్ ఆపెయ్యాలి. ప్రయాణీకులెవరూ ఫోన్ మాట్లాడకూడదు. ఎవరి సీటులో వారే కూర్చోవాలి – ఇలా.



చిన్నారులకు చేయందిస్తూ సత్యప్రసాద్!

నిత్యం కిటకిటలాడే మియాపూర్-గచ్చిబౌలి రోడ్డు బద్ధకంగా మునగదీసుకున్న మౌనిలా ధ్యానంలో ఉంది... ఓఆర్ఆర్ మీదుగా వెళ్తుంటే ఉన్నట్టుండి పొగమంచు కమ్మేసి ఉక్కిరిబిక్కిరి చేసి, అంతలోనే అప్పటి వరకు కురిసి ఆగిపోయిన వర్షంలా మాయమైపోయేది. ఈ దోబూచులాటలో సూర్యుని ముగ్ధమనోహర బింబాన్ని తనివితీరా చూస్తున్నాం.

అంతలో అశ్వినిగారు కారు స్లో చేయించి ఎగ్జిట్ 12 దగ్గర **కళాజ్యోతి** వైభవాన్ని చూపించారు. విజయవాడ హైవేలో ప్రొఫెసర్ పార్థసారథి గారు మద్రాసు ఫిల్టర్ కాఫీలో మొదటి డోస్ పడాలని సూచించారు. మంచి ఆలోచన అని మిగిలిన ఇద్దరం ఊకొట్టడంతో మంచి వ్యూ పాయింట్‌లో ఉన్న ఆ కాఫీ పాయింట్‌లో వేడి కాఫీతో గొంతును అభిషేకించాం.. మళ్లీ ప్రయాణం మొదలు.. తర్వాత సెవెన్ దగ్గర మాత్రమే అని హెచ్చరించారు, కెప్టెన్.

ఆదివారం కావటంతో హైవే ట్రాఫిక్‌తో కళకళలాడుతోంది.. రెండు గంటల తరువాత –సెవెన్‌లో రీఛార్జ్ అయ్యేందుకు చాలామంది క్యూ కడుతున్నారు. అక్కడెందుకో ఒక ఆత్మీయ వాతావరణం మాఘమాసం వెన్నెల్లా కురుస్తూ ఉంటుంది.. ప్రతి గంటకు ఒకసారి అలారంలా పాట మోగగానే అలంకారమేదో చేసినట్టు అక్కడి స్టాఫ్ నాలుగు స్టెప్పులతో అతిథులతో అలరించటాన్ని ఆనవాయితీ చేశారు.. మేజువాణిలాంటి ఆ రివాజుని మొదటి సారి చూసినవాళ్ళు ఫోన్‌లో బంధిస్తుంటారు. అదిచూసి పాత వాళ్ళు నవ్వుకుంటుంటారు.. అశ్వినిగారు – 'సెలబ్రేషన్ ఆఫ్ లైఫ్' అంటారు. సూర్యాపేట్ పాత టౌన్‌కి–బైపాస్‌కి మధ్య అంతా షాపింగ్ మాల్స్‌తో నిండిపోయింది. అప్పుడే ఓపెన్ చేసిన మథూస్‌లో మంచి దుశ్శాలువా, కండువా తీసుకున్నాం.

మళ్ళీ రోడ్డెక్కిన మాకు టారీఫ్‌ల నుంచి, లారీల వెనుక ఉండే కేప్షన్ల వరకు అనేక అంశాలు హాట్ టాపిక్స్‌గా మారాయి. 'పరమేష్ మమ్మల్ని దింపేలోపు నీకు డిగ్రీ వచ్చేస్తుంది' అన్నారు ప్రొఫెసర్ పార్థసారథి గారు. కొండపల్లి సర్కిల్లో మంచి దానిమ్మ పళ్లు సత్యప్రసాద్ గారి కోసం తీసుకున్నాం. గుంటుపల్లి దాటి వెస్ట్ బైపాస్ తీసుకుని, గన్నవరం అంచు నుండి తోటపల్లి దారిపట్టాం. అక్కడి నుంచి కొంచెం ఇష్టం, కొంచెం కష్టమన్నట్టు రోడ్డు సాగింది. మధ్యాహ్నం రెండు గంటలప్రాంతంలో తోటపల్లి ఊళ్ళో ప్రవేశించాం. ఎటు చూసినా ఫ్లెక్సీలతో ఊరు కళకళలాడుతోంది. కారణమేమిటంటే స్థానికంగా ఉన్న అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి..


కర్మజీవి - చిరునవ్వుల వెలుగులు - చిన్నారులు

"హీల్ ప్యారడైజ్" అన్న చిన్న బోర్డు చూసి అరకిలోమీటరు లోపలికి వెళ్ళగానే కేంపస్ కనిపించింది. మాకోసం అక్కడ పాతికేళ్ల యువకుడు (తర్వాత వైస్ ప్రిన్సిపాల్ అని తెలిసింది.) హరీష్ ఎదురుచూస్తూ మమ్మల్ని లోపలికి ఆహ్వానిస్తూ.. గెస్ట్ ఐడి మాలలు మా మెళ్ళో వేసారు. లోపలికి ప్రవేశించామో లేదో సువిశాలంగా సుందరంగా అప్రతిహతంగా కనిపించింది హీల్ ప్యారడైజ్.. చుట్టూ వెయ్యి ఎకరాల చెరువు చుట్టుకుని – ఆపైన కొండలు కాపలా! మా పరిస్థితి అర్థం చేసుకున్నట్లు మాకో ప్రెజెంటేషన్ చూపించాడు హరీష్.. కాస్త కుదబలుక్కోగలిగాం..
హీల్ ప్యారడైజ్ అంటే Health and Education for All అని తెలుసుకోగలిగాం.. అక్కడున్న అనేక షీల్డ్స్, సన్మాన పత్రాలు ఆ విషయాన్ని ధ్రువీకరించాయి.. మమ్మల్ని కొంచెం దూరంలో ఉన్న మరో బిల్డింగ్‌కు తీసుకెళ్ళాడు. అక్కడ డా. సత్య ప్రసాద్ దంపతులు, డా.మాధవరావు దంపతులు మాకు సాదరంగా స్వాగతం పలికారు. ముందు ఫ్రెష్ అయి రండి భోంచేద్దురు అన్న ఆత్మీయవచనంతో అక్కడే మాకు ఏర్పాటు చేసిన బస వైపు కదిలాం. చాలా సౌకర్యంగా ఉంది మాకిచ్చిన విడిది.. ప్రతి చిన్న విషయాన్ని ఎంతో శ్రద్ధగా అమర్చిన తీరు – ఎ.సి., రిమోట్ కంట్రోల్ ఫాన్ – ఆధునిక టాయ్‌లెట్స్ – ప్రతీది అమర్చి వున్నాయి. అన్నింటినీ మించి ప్రతి గదిలో ఒక ఈజీ రిలాక్సింగ్ సోఫా – ఇంపోజింగ్‌గా వుంది!

సత్యప్రసాద్ గారిని అశ్విని గారు దుశ్శాలువాతో సత్కరించి, మెడలో కండువా వేసి – దానిమ్మ పళ్లు చేతిలో పెట్టారు – **మిసిమి** పుస్తకాలూ ఇచ్చారు. "నేను రోజూ వందగ్రాముల దానిమ్మ రసం తాగుతాను" అని ఆప్యాయంగా తీసుకున్నారు!

ఆ తోటలో కాసిన చిక్కుడు కాయలతో చేసిన లేలేత కూర, చక్కటి ఆనపకాయ పప్పు, బీరకాయ పచ్చడి, మజ్జిగ పులుసు మెనూతో.. డా. ఉష మేడం (డా. సత్యప్రసాద్ గారి ఎమ్.బి.బి.ఎస్. క్లాస్మేట్) ప్రత్యేకంగా చేసిన అన్నం పాయసం మాకు కొత్త శక్తినివ్వగా, డా. సత్యప్రసాద్ గారు ముందు కేంపస్ చూసి రండంటూ హరీష్‌ను తోడిచ్చి పంపించారు. అక్కడ బగ్గీ ఎక్కి (గోల్ఫ్ కార్ట్) హరీష్ వివరాలు చెబుతుండగా కేంపస్ అంతా తిలకించాం.. ఇదేదో కొత్త ప్రపంచంలోకి వచ్చామని మాకర్థమయింది..

ఎంతోమంది పిల్లలు.. రకరకాల విన్యాసాలు చేస్తూ కనిపించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న పిల్లలు గుంపులు గుంపులుగా చదువుకుంటూ చర్చించుకుంటున్నారు. ఇంకొందరు గోడమీద పెయింటింగ్ చేస్తున్నారు. ఇంకోచోట మరీ చిన్న పిల్లలు హుషారుగా పరిగెడుతున్నారు.. కొంతమంది రాబోయే స్కూల్ డే కి ఎలాంటి డెకరేషన్ చేయాలో బ్లాక్ బోర్డ్ మీద ఆ డెకరేషన్ బొమ్మ రూపంలో వేస్తున్నారు. హరీష్ మాకు ఇక్కడ బోధనా పద్ధతులు ఎలా ఉంటాయో వివరించారు. ఇంతకీ విశేషం ఏమిటంటే తను అక్కడ చదువుకున్నవాడే. అక్కడే పనిచేసేందుకు టీచింగ్ మీద ప్రేమతో మంచి జీతమున్న సాఫ్ట్వేర్ ఉద్యోగం వదులుకున్నాడని తర్వాత మాధవరావు గారు చెప్పటంతో ఆ కుర్రాడి మీద గౌరవం మరింత పెరిగింది మాకు..



హిల్ ప్యారడైజ్ - ఒక డివైన్ దీవి

ఇలా ప్యారడైజ్‌లా ఉన్న హిల్ ప్యారడైజ్ చూసొచ్చాక మేము సత్యప్రసాద్ గారిని కలిశాం. ఆయన ఆరడుగుల ఆజానుబాహుడు. చేతిలో వాకింగ్ స్టిక్‌తో చుట్టూ చూస్తూ తిరుగుతుంటారు. మీరో అరగంట రిలాక్స్ అయి వస్తే ఆ పక్కనే ఉన్న కొండ, దానిపక్కనే ఉన్న చెరువు మీదుగా కొండల్లోకి జారిపోయే సూరీడుకు వీడ్కోలు పలికేశాక, మీకిష్టమైనట్లు నన్ను ప్రశ్నించొచ్చంటూ నవ్వారు.. నిజంగానే చుట్టూతా ప్రహరీలా కాస్త దూరంగా కొండలు పక్కనే భరోసాగా స్కూల్‌ను ఆనుకుని చెట్లతో నిండి ఉన్న పెద్ద కొండ.. సిగ్గుపడుతున్న కన్నెపిల్లలా ఎర్రటి బుగ్గల సూరీడు అలా మాయమైపోతుండగా డా. సత్యప్రసాద్ గారు ఇంకో బిల్డింగ్ టెర్రెస్ పైకి మమ్మల్ని తీసుకు వెళ్ళారు. అక్కడ బాల్కనీలోంచి చూస్తుంటే సువిశాలమైన ఎనిమిది ఎకరాలు మైదానంలోలో బాస్కెట్‌బాల్ ఆడే పిల్లలు, ఫుట్ బాల్ ఆడే పిల్లలు, రన్నింగ్ చేసే పిల్లలు.. ఓహ్ ఒక స్వచ్ఛమైన ప్రపంచపు నిర్మలమైన నవ్వుల సంగీతం గాలి అలలపై తేలుతూ వచ్చి మమ్మల్ని చేరింది. మనసంతా ప్రశాంతత చేకూరింది.. ఆ తర్వాత ఆ దగ్గర్లోనే వారు తలపెట్టిన విశ్వవిద్యాలయం అడ్మినిస్ట్రేషన్ కోసం కట్టిన కొత్త భవనం రెండో అంతస్తుకు తీసుకెళ్లారు – అక్కడ – అన్నీ గ్లాస్ గోడలే – చుట్టూ అద్భుతమైన వ్యూ – ఆయనతో ఇంటర్వ్యూ!

డా. సత్యప్రసాద్ గారి సహాయకులు కాఫీ, కారప్పూస, అరిసెలు ఏర్పాటు చేసి మమ్మల్ని పిలిచారు. సత్యప్రసాద్ గారు తన ప్రయాణం ఎప్పుడు మొదలయిందో మాకు చెప్పడం మొదలు పెట్టారు.. మూడు గంటల సమయం ఎలా గడిచిందో తెలీదు. సంజె చీకట్లు జారుకోగానే చిక్కటి చీకటి చుట్టూ పరుచుకుందని కిందకు వస్తే కానీ మాకు తెలియలేదు.. ఆయన అనుభవాలు జీవితం పట్ల ఆయనకున్న నమ్మకం, ఆయన్ని ఆయన మలుచుకున్న తీరు, ఇంగ్లాండ్ ప్రయాణం, అక్కడ ప్రాక్టీస్, హిల్ ప్యారడైజ్ స్థాపన వెనుక ఉన్న అసలు విషయం అనేక విషయాలు, ఇక్కడ నుండి ఉండబోయే ప్యారడైజ్ ప్రయాణం దొర్లాయి వారి సంభాషణలో.. అవన్నీ త్వరలో మీరు చదువుతారు.. మాఘ పౌర్ణమి వెన్నెల మంచు కురుస్తోంది! రాత్రి భోజనం చేశాక సత్యప్రసాద్ గారు మమ్మల్ని కూచోనివ్వలేదు. కొత్తగా కడుతున్న జూనియర్ కళాశాల భవంతి చూపెట్టారు మాకు. విద్యార్థుల కోసం